4 వేలతో బతికేదెట్టా?

అతి తక్కువ గౌరవ వేతనంతో కుటుంబాన్ని పోషించేదెలా?

- మోదీ సర్కార్‌పై ఆశావర్కర్ల ఆగ్రహం
- వేతనాలను పెంచాలని కేంద్రానికి డిమాండ్
- ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ నిరసన

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: ఆశావర్కర్లు కేంద్ర ప్రభుత్వంపై నిరసన గళమెత్తారు. మోదీ సర్కార్‌పై తిరుగుబాటుకు దిగారు. కేవలం రూ.4వేల గౌరవ వేతనంతో కుటుంబ అవసరాలు ఎలా తీరుతాయని మోదీ సర్కార్‌ను ప్రశ్నిస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం గత 60 రోజులుగా జంతర్‌మంతర్ వద్ద వేలాది మంది ఆశావర్కర్లు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఇక్కడ జరుగుతున్న నిరసనల్లో 26 రాష్ట్రాల నుంచి వచ్చిన 7వేల మందికిపైగా ఆశావర్కర్లు పాల్గొన్నారు. తమ వేతనాన్ని పెంచాలని వారు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రధాని మోదీ తమ డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు. కామన్‌మ్యాన్ గురించి ప్రధాని ఆలోచించాలని ఆశావర్కర్లు అన్నారు. 'ప్రధాని మోదీజీ.. కామన్‌మ్యాన్‌కు బతుకులేకుండా పోయింది. కనీసం రొట్టెముక్క దొరకటం లేదు. స్టార్ క్యాంపెయినర్‌గా కేవలం బీజేపీ గురించి ఆలోచించటం కాదు, దేశం గురించి ఆలోచించండి' అని అనిత అనే ఆశావర్కర్ కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన మహిళా ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, నరేగా(ఉపాధి హామీ), అసంఘటిత రంగాలకు చెందిన మహిళా కార్మికులు పెద్ద సంఖ్యలో నిరసనల్లో పాలుపంచుకున్నారు.

గౌరవ వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

మహిళలపై అఘాయిత్యాల్ని అరికట్టరా?

2014 తర్వాత దేశంలో మహిళలపై హింస పెరిగిందని హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఫాల్మా చౌహాన్ ఆందోళన వ్యక్తం చేశారు. 'బేటి బచావో బేటి పడావో.. వంటి డొల్ల వాగ్దానాలు, నినాదాలతో మమ్మల్ని ఇంకా ఎంతకాలం మోసం చేస్తారు? మణిపూర్‌లో మహిళలపై దారుణాలు చోటుచేసుకున్నాయి. ఇదే జంతర్‌మంతర్ వద్ద నిరసన గళం వినిపించిన మహిళా రెజ్లర్లకు ఇప్పటికీ న్యాయం జరగలేదు' అని ఫాల్మా చౌహాన్ మోదీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు.

తెలంగాణలో ఆశాలకు రూ. 10వేలు

ప్రస్తుతం తెలంగాణలో 28,160 మంది ఆశా వర్కర్లు పని చేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటయ్యే నాటికి వీరికి కేవలం గౌరవ వేతనంగా రూ.2 వేలు అందుతున్నది. అది కూడా సమయానికి వచ్చేది కాదు. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ స్వయంగా ప్రగతి భవన్‌కు ఆశాలను ఆహ్వానించారు. వారితో కలిసి భోజనం చేశారు. వారి సమస్యలను ఓపిగ్గా విన్నారు. పదేండ్లలో వారి వేతనాల్ని ప్రభుత్వం నాలుగుసార్లు పెంచింది. ఇప్పుడు రూ.9,900 అందుకుంటున్నారు. ఇందులో కేంద్రం వాటా కేవలం రూ.1800. రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.8,100. కేంద్రం ఇచ్చేదానికి నాలుగురెట్లు రాష్ట్రం భరిస్తున్నది. ప్రతి ఆశా కార్యకర్తకు కేసీఆర్ ప్రభుత్వం రూ.7,848 విలువజేసే స్మార్ట్ ఫోన్‌ను కూడా అందించింది. ప్రతినెలా బిల్లును కూడా ప్రభుత్వమే చెల్లిస్తున్నది.

వివిధ రాష్ట్రాల్లో వేతనాలు (రూ.ల్లో)

రాష్ట్రం	వేతనం
గుజరాత్	4,500
రాజస్థాన్	5,700
కర్ణాటక	4,000
ఛత్తీస్‌గఢ్	5,250

తెలంగాణ రాకముందు 2,000
తెలంగాణ వచ్చాక 9,900

8 మంది జవాన్ల మృతదేహాలు లభ్యం

సిక్కిం వరదల్లో చిక్కుకున్న పర్యాటకులు సురక్షితం

న్యూఢిల్లీ : సిక్కిలో ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదల్లో గల్లంతైన జవాన్లలో ఎనిమిది మంది మృతదేహాలను గుర్తించామని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం వెల్లడించారు. జవాన్లు, సాధారణ పౌరుల మృతదేహాల కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు వరదల నేపథ్యంలో మంగన్ జిల్లాలోని లాచెన్, లాచుంగ్ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన 3 వేల మందికి పైగా పర్యాటకులు సురక్షితంగా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. వారిని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు.

ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న 150 మంది కార్మికులు

సిక్కిం-పశ్చిమబెంగాల్ సరిహద్దులో నిర్మితమవుతున్న రైల్వే టన్నెల్ వద్ద పని చేస్తున్న 150 మంది కార్మికులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. రాబోయే వరద విపత్తు గురించి తెలుసుకొన్న నిర్మాణ కంపెనీ అధికారులు వెంటనే కార్మికులు నివాసం ఉంటున్న ప్రాంతం వద్దకు వెళ్లారు. రాత్రి సమయంలో నిద్రపోతున్న కార్మికులను అప్రమత్తం చేసి, అక్కడి నుంచి క్షణాల్లో తరలివెళ్లేలా చేయడంతో పెనుప్రమాదం తప్పింది.

తలలో దిగిన 61 మేకులు

- మణిపూర్‌లో విద్యార్థులపై విచక్షణారహితంగా కాల్పులు
- శాంతిభద్రతల పేరిట సాయుధ దళాల అరాచకం
- బలగాలపై నియంత్రణ లేదని చేతులెత్తేసిన సీఎం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): మైతీ– కుకీల తెగల మధ్య ఐదు నెలలుగా సాగుతున్న ఘర్షణలో ఈశాన్య రాష్ట్రం మణిపూర్ మండిపోతున్నది. ఆందోళనకారులతో పాటు శాంతిభద్రతలను కాపాడేందుకు మోహరించిన సాయుధ బలగాల కర్కశానికి సామాన్యులు బలైపోతున్నారు. సాయుధ బలగాలు విచక్షణారహితంగా కాల్పులు జరపడంతో అక్కడ మరింత ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఓ జాతీయ క్రీడాకారుడు తీవ్రంగా గాయపడి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఇటీవల జరిగిన ఇద్దరు విద్యార్థుల హత్యకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులపై సాయుధ బలగాలు విరుచుకుపడ్డాయి. నిరసనకారులను చెదరగొట్టేందుకు ముందస్తు హెచ్చరికలు లేకుండాలని పెల్లెట్ గన్నులతో జవాన్లు కాల్పులు జరపగా.. జాతీయ క్రీడాకారుడు ఉత్తమ్ సాయిబామ్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడి తలలో 61 మేకులు దిగాయి. ప్రస్తుతం అతడు దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. తిరిగి అతడు మైదానంలో దిగుతాడో లేదో తెలియడం లేదు. కాగా, అతని తల ఎక్స్‌రే ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బీజేపీ సర్కార్‌పై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్నారు. ఈ ఘటనతో మైతీ వర్గీయులు కూడా బీజేపీకి దూరమవుతున్నారు. మరోవైపు ఈ ఘటనపై తీవ్ర విమర్శలు వస్తుండగా.. సీఎం బీరేన్‌సింగ్ వ్యాఖ్యలు మరింత అగ్గి రాజేసింది. సాయుధ దళాలు రాష్ట్ర పరిధిలోకి రావని, వారిని నియంత్రించే అధికారం తనకు లేదని ఆయన చేతులు దులుపుకోవడంపై విమర్శలు వస్తున్నాయి.

హెచ్చరికలు లేకుండానే...

విద్యార్థులను చెదరగొట్టేందుకు పెల్లెట్ గన్ను (మేకులను ఉపయోగించి కాల్పులు జరిపే తుపాకులు)లను వాడటం తగదు. ముందస్తు హెచ్చరికలు చేయాలి. రబ్బరు బులెట్లు, స్మోక్ బాంబులు, పెద్దగా శబ్దం చేసే మాక్ బాంబులు వాడి నిరసనకారులను అదుపులోకి తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి ఆయుధాలను విద్యార్థులపై ప్రయోగించడమేంటి.

– బబ్‌లూ లోయిటోంగబామ్, సామాజిక కార్యకర్త

మణిపూర్‌లో ఇంటర్నెట్‌పై నిషేధం మళ్లీ పొడిగింపు

ఇంఫాల్, అక్టోబర్ 7: శాంతిభద్రతల పరిరక్షణలో విఫలమైన బీజేపీ పాలిత మణిపూర్ సర్కార్ ఆ రాష్ట్రంలో మరోసారి ఇంటర్నెట్‌పై నిషేధాన్ని పొడిగించింది. హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో గత ఆరు ఐదు నెలల ఇంటర్నెట్‌పై నిషేధం అమలవుతున్నది. ఈ నెల 11 వరకు నిషేధం అమల్లో ఉంటుందని తాజాగా అధికారులు చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలోనే నిషేధాన్ని పొడిగించినట్టు వెల్లడించారు.



చేతిలో సెలైన్ పట్టుకుంటేనే చికిత్స

కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో దయనీయం

రాయ్‌పూర్ : కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో సర్కారీ దవాఖానల్లో వైద్య సదుపాయాలు ఘోరంగా ఉన్నాయి. రాజధాని రాయ్‌పూర్‌కు 25 కిలోమీటర్ల దూరంలోని అబన్‌పూర్ కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో ఒక బాలుడు రోగి పక్కన చేతిలో సెలైన్ సీసా పట్టుకొని నిలబడి ఉన్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ రోగి కూర్చోవడానికి చక్రాల కుర్చీ లేదా స్ట్రెచర్ అందుబాటులో లేదు. సెలైన్ సీసా తగిలించడానికి స్టాండ్ కూడా లేదు. ఓ టీవీ ఛానల్ దవాఖానను పరిశీలించగా.. అక్కడ రోగులకు దిండ్లు, దుప్పట్లు, మంచి నీరు అందుబాటులో లేనట్టు తెలిసింది. దీంతో ఆ రాష్ట్ర సర్కార్‌పై విమర్శలు వస్తున్నాయి.

మా నాన్నకు టిక్కెట్ ఇవ్వొద్దు!

రాజస్థాన్‌లో బీజేపీకి మాజీ ఎమ్మెల్యే కుమార్తె హెచ్చరిక

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ప్రకటనకు ముందే బీజేపీలో అసంతృప్తి పెల్లుబుకుతున్నది. మాజీ ఎమ్మెల్యే అయిన తన తండ్రికి పార్టీ టిక్కెట్ ఇవ్వద్దంటూ ఆయన కుమార్తెనే అధిష్ఠానానికి అల్టిమేటం ఇచ్చింది. ఒకవేళ టిక్కెట్ ఇస్తే తన తండ్రిపై రెబల్ అభ్యర్థిని బరిలోకి దింపి, ఇతర టిక్కెట్ ఆశావహులతో కలిసి ఓడిస్తానని హెచ్చరించడం రాజస్థాన్ రాజకీయాల్లో ప్రస్తుతం సంచలనంగా మారింది. మాజీ ఎమ్మెల్యే జయరామ్ జాటవ్ కూతురు మీనా జాటవ్ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిసి తన తండ్రికి టిక్కెట్ ఇవ్వవద్దని కోరారు.

ఆస్తి కొట్టేసేందుకు కుట్రలు..

తన ఆస్తులను కొట్టేసేందుకు స్వయానా తన తండ్రే కుట్రలు చేస్తున్నారని, అలాంటి వ్యక్తి సామాన్య ప్రజలకు ఏం న్యాయం చేస్తాడని మీనా ఆరోపించారు.

మళ్లీ సీఎం అవుతానా?

- మా ప్రభుత్వం మంచిగానే పని చేసిందా?
- ఓటమి భయంతో ఎన్నికల ర్యాలీలో ప్రజలకు మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశ్నలు
- చర్చనీయాంశమైన ముఖ్యమంత్రి వ్యాఖ్యలు
- శివరాజ్‌కు ఇంకా టిక్కెట్ ఇవ్వని బీజేపీ

భోపాల్, అక్టోబర్ 7: త్వరలో జరుగనున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీజేపీకి ఓటమి భయం పట్టుకొన్నట్టు కనిపిస్తున్నది. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని, వచ్చే ఎన్నికల్లో తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటి వరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు సంబంధించి మూడు జాబితాలను విడుదల చేసిన కమలం పార్టీ.. సీఎం శివరాజ్ పేరు ఇంకా ప్రకటించకపోవడాన్ని వారు ప్రస్తావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో శివరాజ్ సింగ్‌కు టిక్కెట్ దక్కడం కూడా కష్టమేనని విపక్ష నేతలు ఎద్దేవా చేస్తున్నాయి. ఈ క్రమంలో సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. మధ్యప్రదేశ్‌లోని దిండోరిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ 'వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి నేను మళ్లీ సీఎం అవుతానా?' చెప్పండి అని ప్రజలను ఉద్దేశించి ప్రశ్నించడం చర్చనీయాంశంగా మారింది. 'నేను మంచి ప్రభుత్వాన్ని నడుపుతున్నానా? లేక చెడ్డ ప్రభుత్వాన్ని నడుపుతున్నానా? మీరు చెప్పండి! ఈ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారా? ' అని సభకు వచ్చిన ప్రజలను అడిగారు. అంతేకాకుండా 'కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో కొనసాగాలా? దేశ ప్రధానిగా నరేంద్ర మోదీనే కొనసాగాలా?' అని ప్రశ్నలు వేశారు. ఇటీవల జరిగిన పలు సమావేశాల్లోనూ శివరాజ్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. సొంత నియోజకవర్గమైన బుధ్నిలో ఇటీవల మాట్లాడుతూ 'నన్ను ఎన్నికల్లో పోటీ చేయమంటారా?' అని అడిగారు. తాను లేకుంటే సోదరుడి వంటి తనను కోల్పోతారని మహిళలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అదేవిధంగా పలు ఇతర సందర్భాల్లో 'రాజకీయాలు జారుడు బండ వంటివి', 'నాకు ఏ పదవిపై అత్యాశ లేదు' అంటూ వ్యాఖ్యలు చేశారు.

బరిలోకి కేంద్ర మంత్రులు, ఎంపీలు

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే బీజేపీ ఇప్పటికే ముగ్గురు కేంద్ర మంత్రులు, పలువురు ఎంపీలను బరిలోకి దింపిందనే చర్చ నడుస్తున్నది. అధికారం దక్కితే ఈసారి సీఎం సీటుకు శివరాజ్ కాకుండా.. వీరిలో కొంత మంది పోటీలో ఉండే అవకాశం ఉన్నదని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. కాగా, శివరాజ్ మరోసారి సీఎం అయ్యే అవకాశమే లేదని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ అన్నారు. గురువారం ధార్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో ఆమె మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌కు వస్తున్న ప్రధాని మోదీ.. శివరాజ్ పేరును చెప్పేందుకు ఇష్టపడటం లేదని, తన కోసం ఓటు వేయండంటూ మోదీ ప్రజలను అభ్యర్థిస్తున్నారని పేర్కొన్నారు.

కొలీజియం సిఫార్సులు బుట్టదాఖలుపై విచారణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: కొలీజియం సిఫార్సుల విషయంలో కేంద్రం చూపుతున్న నిర్లక్ష్యంపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం విచారించనుంది. జడ్జీల నియామకం, బదిలీలకు సంబంధించి సుప్రీంకోర్టు గత ఏడాది చేసిన సిఫార్సులను అమలు చేయడంలో కేంద్రం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నదని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్, మరో దానిపై జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాంశు ధులియాలతో కూడిన ధర్మాసనం విచారించనున్నది. గత నెల 26న జరిగిన విచారణలో కొలీజియం చేసిన సిఫార్సుల ఆమోదంలో కేంద్రం ఆలస్యం పట్ల ధర్మాసనం ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. ఈ సమస్య పరిష్కరించాలని అటార్నీ జనరల్‌కు సూచించింది.

'ఉపాధి'ని నీరుగార్చుతున్న కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, అక్టోబర్ 7: ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం కావాలనే నీరుగార్చుతున్నదని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. ఈ పథకానికి నిధులను విడుదల చేయకుండా పరోక్షంగా నామరూపాలు లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నదని తెలిపారు. పారదర్శకత పేరుతో డిజిటలైజేషన్‌ను ప్రవేశపెడుతూ పథకాన్ని అణగదొక్కుతున్నదని విమర్శించారు. మోదీ ప్రభుత్వ చర్య వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు.

రాజస్థాన్‌లోనూ కులాల సర్వే

జైపూర్, అక్టోబర్ 7: శాసనసభ ఎన్నికల వేళ బీహార్‌లో మాదిరి కులాల సర్వే నిర్వహించాలని రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశం అనంతరం సీఎం అశోక్ గెహ్లోట్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'ఏ కుల జనాభా ఎంత ఉందో తెలిస్తే, వారి కోసం ఏం చేయొచ్చనేది తెలుస్తుంది' అని గెహ్లోట్ అన్నారు. మరోవైపు వచ్చే నెలలో కమిషన్ సమర్పించబోయే నివేదిక అనంతరం కులగణన సర్వే ఫలితాలపై నిర్ణయం తీసుకుంటానని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు.

హర్యానాలో అధికారులను నిర్బంధించిన రైతులు

అంబాల: వ్యవసాయ వ్యర్థాలను దహనం చేస్తున్న వారిని గుర్తించడానికి వచ్చిన అధికారులను హర్యానాలోని అంబాల జిల్లా రైతులు నిర్బంధించారు. హర్యానా స్పేస్ అప్లికేషన్ సెంటర్ పంపిన ఫొటోల ఆధారంగా తనిఖీలు చేసి, సంబంధిత రైతులకు చలాన్లు విధించడానికి పట్వారీ, ఇతర వ్యవసాయ అధికారుల బృందం అంబాల జిల్లాలోని కమవా గ్రామానికి చేరుకుంది. ఇది తెలిసిన గ్రామస్తులు, రైతులు వారి వాహనాన్ని చుట్టుముట్టి కొన్ని గంటల పాటు వారిని నిర్బంధించారు. ప్రభుత్వం పత్తికి కనీస మద్దతు ధర కల్పించాలని, వ్యవసాయ పరికరాల కొనుగోలులో సబ్సిడీ ఇవ్వాలని, చలాన్లను నిలిపివేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

బీజేపీ చీఫ్‌పై పరువు నష్టం దావా

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని 'రావణ్'గా చూపుతూ ఫొటోలు విడుదల చేసిన బీజేపీపై కాంగ్రెస్ పరువు నష్టం కేసు దాఖలు చేసింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ ఐటీ సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయను నిందితులుగా పేర్కొంటూ రాజస్థాన్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ జశ్వంత్ గుర్జార్ జైపూర్ మెట్రోపాలిటన్ కోర్టులో పిటిషన్ వేశారు. 'ఓ మతానికి వ్యతిరేకిగా రాహుల్‌గాంధీని బీజేపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా చూపారు.' అని పిటిషన్‌లో ఆరోపించారు.

'మీడియా నోరు నొక్కేందుకే దాడులు'

న్యూఢిల్లీ : ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో తమ సంస్థపై చేసిన ఆరోపణలు బోగస్ అని, అవి నిలబడవని ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ 'న్యూస్‌క్లిక్' పేర్కొన్నది. స్వతంత్ర మీడియా నోరునొక్కేందుకు ఇటువంటి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించింది. 'మా సంస్థకు చైనా లేదా చైనా సంస్థల నుంచి ఎలాంటి నిధులు లేదా ఆదేశాలు రాలేదు. మేం ఎప్పుడూ హింస, వేర్పాటువాదం, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడలేదు' అని న్యూస్‌క్లిక్ పేర్కొన్నది.

నాలుగేండ్లలో మార్స్‌పై స్పేస్‌క్రాఫ్ట్ ల్యాండింగ్

బాకు : మరో మూడు నాలుగేండ్లలో అంగారక గ్రహంపై స్పేస్‌క్రాఫ్ట్‌ను స్పేస్ ఎక్స్ ల్యాండింగ్ చేస్తుందని ఆ కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ ధీమా వ్యక్తం చేశారు. విశ్వ రహస్యాలు తెలుసుకునేందుకు స్పేస్ ఎక్స్ పరిశోధనలు కొనసాగుతాయని ఆయన తెలిపారు. అజర్‌బైజాన్‌లోని బాకులో జరుగుతున్న అంతర్జాతీయ ఆస్ట్రోనాటికల్ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్పేస్ ఎక్స్ భవిష్యత్తులో చేపట్టబోయే ప్రయోగాల గురించి వివరించారు. స్పేస్ ఎక్స్‌కు చెందిన స్టార్‌షిప్ గురించి కూడా ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.



అత్యంత వేడి సంవత్సరంగా 2023?

న్యూఢిల్లీ : అత్యంత వేడి సంవత్సరంగా 2023 అవతరిస్తున్నదా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తున్నది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవడమే ఇందుకు కారణం. ఈ ఏడాదిలో ఇప్పటికే చాలా రోజుల పాటు ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు ప్రి-ఇండస్ట్రీయల్ లెవెల్‌ను దాటి నమోదయ్యాయి. 2023 అక్టోబర్ 2 వరకు 86 రోజుల పాటు ప్రపంచ సగటు ఉష్ణోగ్రతలు ప్రి-ఇండస్ట్రీయల్ లెవెల్ కంటే 1.5 సెల్సియస్ ఎక్కువగా నమోదైనట్టు కోపర్నికస్ క్లైమెట్ చేంజ్ సర్వీస్ డాటా విడుదల చేసింది. వాతావరణ మార్పుల కారణంగా 2024లోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగానే అవకాశం ఉందని డాటా విశ్లేషించింది.

కొత్త రుచి.. అమ్మోనియం క్లోరైడ్

న్యూఢిల్లీ : మనకు తెలిసి ఆరు రుచులున్నాయి. ఆధునిక సైంటిస్టుల లెక్క ప్రకారం ప్రాథమిక రుచులు ఐదే. తాజాగా ఆరో రుచి.. అమ్మోనియం క్లోరైడ్ వల్ల ఏర్పడుతున్నదని యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా సైంటిస్టులు కనుగొన్నారు. మానవుడి నాలుకకు ఆరో ప్రాథమిక రుచి అనుభూతి 'అమ్మోనియం క్లోరైడ్' వల్ల ఏర్పడుతున్నదని వారు నిర్ధారించారు. వీరి పరిశోధన ఫలితాలు 'నేచర్ కమ్యూనికేషన్స్'లో ప్రచురితమయ్యాయి. స్కాండినేవియన్ చాక్లెట్స్‌లోని అమ్మోనియం క్లోరైడ్ భిన్నమైన రుచిని ఏర్పరుస్తున్నదని పరిశోధకులు కనుగొన్నారు.

లోహ ఆస్టరాయిడ్‌పై నాసా పరిశోధనలు

న్యూయార్క్ : లోహాలతో నిండిన ఓ ఆస్టరాయిడ్‌పై పరిశోధనలు చేసేందుకు నాసా సన్నాహాలు చేస్తున్నది. ఈనెల 12 సైక్ స్పేస్‌క్రాఫ్ట్‌ను ప్రయోగించేందుకు నాసా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భూమి నుంచి 2.2 బిలియన్ మైళ్ల దూరంలోని 16 సైక్ అనే ఉల్కపై పరిశోధనలు చేసి విశ్వంలో లోహాలు, ఇతర ఖనిజాల పుట్టుక గురించి తెలుసుకునేందుకు నాసా ఈ ప్రయోగం చేపడుతున్నది. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం జరగనున్నది. అరిజోనా స్టేట్ యూనివర్సిటీ నాసాకు సహకారం అందిస్తున్నది.



ఎముక మజ్జ దానం చేసి.. రోగిని కాపాడి..

వాషింగ్టన్ : ఒక పసివాడి ప్రాణాన్ని కాపాడటానికి ఒక డాక్టర్ చేసిన దాతృత్వానికి యావత్ ప్రపంచం శభాష్ అని పొగుడుతున్నది. తన శరీరంలోని బోన్ మారో (ఎముక మజ్జ) దానం చేసి నిజమైన ప్రాణదాతగా నిలిచారు. అమెరికాలో ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ అలీ అల్‌సమర ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక పిల్లాడికి అవసరమైన బోన్ మారో ట్రాన్స్‌ప్లాంట్‌కు తన బోన్‌మారో ఇచ్చి ప్రజల హృదయాలను గెల్చుకున్నారు. ఆయన చేసిన సాయం 'గుడ్ న్యూస్ మూవ్‌మెంట్' టాగ్‌తో సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యింది.

2,114 గ్రూపులు, చానెళ్లపై టెలిగ్రామ్ నిషేధం

న్యూఢిల్లీ: బాలల లైంగిక వేధింపుల కంటెంట్‌కు సంబంధించిన 2,114 గ్రూపులు, చానెళ్లను నిషేధించినట్టు ప్రముఖ మొబైల్ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ శనివారం వెల్లడించింది. బాలలపై లైంగిక వేధింపుల సమాచారాన్ని భారత్‌లోని తమ వేదికల్లో వెంటనే తొలగించాలని సామాజిక మాధ్యమాలకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. నిబంధనలను ఉల్లంఘిస్తే ఐటీ చట్టంలోని సెక్షన్ 79 కింద ఆయా సంస్థలకు కల్పిస్తున్న రక్షణను ఉపసంహరించుకొంటామని కేంద్ర ఐటీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ హెచ్చరించారు. నోటీసులపై స్పందించిన టెలిగ్రామ్.. చట్టపరమైన, నైతిక విలువలకు కట్టుబడి ఉంటామని పేర్కొన్నది.